సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



సోమశిలలో 20.78 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారానికి 20.784 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 692 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,260
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,412
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,574
నవర (8 గ్రాములు)	రూ.44,592

గరిష్టం/కనిష్టం
37.3 /28.7

వాతావరణం

వాతావరణంలో తేమ 48 శాతంగా ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆకాశం శుక్రవారం మేఘావృతమై ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మూడో లైన్‌పై ట్రయల్ రన్



మనుబోలు: మనుబోలు – గూడూరు మధ్య మూడో రైల్వే లైన్‌ను రైల్వే అధికారులు గురువారం పరిశీలించారు. ట్రయల్ రన్‌ను సౌత్ సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ ప్రణ్‌జీవ్ సక్సేనా సమక్షంలో నిర్వహించారు. మనుబోలు నుంచి గూడూరుకు ఎలాంటి ఆటంకాల్లేకుండా రైలు సాఫీగా వెళ్లడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

20న జిల్లా స్థాయి యోగా పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా స్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం నిర్వహించనున్నామని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ సింహపురి ప్రెసిడెంట్ పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని టీటీడీ కల్యాణ మండప ఎదురు వీధిలోని షిర్డీ సాయి చారిటబుల్ ట్రస్ట్‌లో పోటీలను నిర్వహించనున్నామని, విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నామన్నారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్ యోగాల్లో తొమ్మిది నుంచి 14 ఏళ్లలోపు, 14 నుంచి 28 ఏళ్లలోపు, 28 ఏళ్లు పైబడిన కేటగిరీల్లో పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. వివరాలకు 94416 85593, 94410 04485 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

212 గ్రామాల్లో భూముల రీ సర్వే

• జేసీ కూర్మనాథ్



మాట్లాడుతున్న కూర్మనాథ్

పొదలకూరు: జిల్లాలోని 212 గ్రామాల్లో రెండో విడత భూముల రీ సర్వే వేగంగా జరుగుతోందని జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేపై వివరాలను తెలుసుకునేందుకు గానూ తహసీల్దార్ కార్యాలయానికి గురువారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మొదటి విడతలో జిల్లాలోని 118 గ్రామాల్లో ఎలాంటి వివాదాల్లేకుండా భూముల రీ సర్వేను పూర్తి చేశామని తెలిపారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతెనింగ్ జరుగుతోందని ప్రకటించారు. ఇందులో భాగంగా రైతు తన వద్ద ఉన్న డాక్యుమెంట్లను తీసుకొచ్చి వారసత్వ హక్కుగా చూపితే అతనికి భూమిని అప్పగిస్తామన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందితే 19 నోటీసును జారీ చేసి విచారణ జరుపుతామని, ఎక్కడా లోపాల్లేకుండా సర్వేను పకడ్బందీగా చేపడుతున్నామని పేర్కొన్నారు. రెండు విడతల అనంతరం 371 గ్రామాలు మిగులుతాయని, అక్కడా సర్వేను వేగవంతంగా పూర్తి చేయిస్తామన్నారు.

3700 ఎకరాలకు పట్టాల పంపిణీ

అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ ద్వారా త్వరలో జిల్లాలో 3,700 ఎకరాలను 3,600 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసి పట్టాలను అందజేయన్నామని జేసీ వెల్లడించారు. ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని, తేదీలను ప్రకటించి పట్టాలను అందజేస్తామన్నారు.

వీఎస్‌యూలో సినీ నటుడు నారాయణమూర్తి



వెంకటాచలం: కాకుటూరు సమీపంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీని సినీ నటుడు, నిర్మాత ఆర్ నారాయణమూర్తి గురువారం సందర్శించారు. వీఎస్‌యూ అభివృద్ధికి చేపడుతున్న వివిధ కార్యక్రమాలపై వీసీ సుందరవల్లిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని చెప్పారు. తానే నటిస్తూ, నిర్మిస్తున్న యూనివర్సిటీ అనే చిత్రంపై విద్యార్థులతో పలు విషయాలను పంచుకున్నారు. అనంతరం నారాయణమూర్తిని రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, తదితరులు సత్కరించారు.

చకచకా పోర్టు నిర్మాణం

‘రామాయపట్నం పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంత రూపురేఖలే మారుతాయి’ అని ఏడాది క్రితం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. నాడు ఆయన అన్న ఈ మాట నేడు వాస్తవ రూపం దాలుస్తోంది. సువిశాలమైన తీర ప్రాంత అభివృద్ధి నౌకాశ్రయాలతోనే సాధ్యమని భావించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని రామాయపట్నం పోర్టుకు పెద్ద పీట వేసింది. డిసెంబర్ నాటికి మొదటి బెర్తులో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.

రామాయపట్నంలో డ్రెడ్జింగ్ 50 శాతం పూర్తి


- డిసెంబర్ నాటికి వాణిజ్య కార్యకలాపాలు
- రెండు బ్రేక్ వాటర్ ఫీడర్ల నిర్మాణం
- అధునాతన సాంకేతిక పరిజ్ఞాన వినియోగం



పూర్తి కావొస్తున్న మొదటి బెర్తు



నిర్మాణంలో బెర్తు





డ్రెగ్ పద్ధతిలో బెర్తు నిర్మాణం

కందుకూరు: రామాయపట్నం పోర్టు పనులను ప్రారంభించిన ఏడాదిలోనే పురోగతిలో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఇప్పటికే బ్రేక్ వాటర్ ఫీడర్లు, డ్రెడ్జింగ్ పనులు పూర్తవ్వగా, మొదటి బెర్త్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ డిసెంబర్ నాటికి రామాయపట్నం పోర్టు నుంచి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించాలనే లక్ష్యంతో పనులను వేగవంతంగా చేపడుతున్నారు. పోర్టు నిర్మాణంలో అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగిస్తుండగా.. మౌలిక వసతుల కల్పనా అదే వేగంతో జరుగుతోంది.

ఇదీ ప్రణాళిక..

తీర ప్రాంత అభివృద్ధిలో భాగంగా రామాయపట్నం పోర్టు నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. రూ.3,736 కోట్లతో 850.79 ఎకరాల విస్తీర్ణంలో ఏడాదికి 34.04 మిలియన్ టన్నుల కార్గో సామర్థ్యంతో పోర్టు తొలి దశ పనులకు టెండర్లు పిలవగా, రూ.2,634 కోట్లతో పనులు పూర్తిచేసేందుకు నవయుగ – అరబిందో భాగస్వామ్య కంపెనీ ముందుకు వచ్చి కాంట్రాక్టు దక్కించుకుంది. పోర్టుకు భూమి పూజను గతేడాది జూలై 20న సీఎం చేశారు. ఏడాదిలోనే అంచనాలకు మించి పోర్టు పనులు పూర్తయ్యాయి.

పనుల పురోగతి ఇలా..

మొదటి దశలో నాలుగు బెర్తులను నిర్మించాల్సి ఉంది. ఇందులో భాగంగా అలల తాకిడి, వేగాన్ని తగ్గించేందుకు చేపట్టిన రెండు బ్రేక్‌వాటర్ ఫీడర్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. నార్త్ బ్రేక్ వాటర్ ఫీడర్ 1.73 కిలోమీటర్ల మేర పూర్తికాగా.. సౌత్ బ్రేక్ వాటర్ ఫీడర్ 3.7 కిలోమీటర్లకు గానూ 3.6 కి.మీ. మేర పూర్తయింది. మిగిలినవి త్వరలో పూర్తి కానున్నాయి. దీని కోసం చీమకుర్తి నుంచి గ్రానైట్ రాళ్లను తీసుకొచ్చి సముద్రం అడుగున 20 మీటర్ల లోతు నుంచి వేసుకుంటూ వచ్చారు. ప్రస్తుతం నీటి ఉపరితలం నుంచి మూడు మీటర్ల ఎత్తు వరకు.. 100 మీటర్ల వెడల్పుతో ఫీడర్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు.

డిసెంబర్ నాటికి నౌకలు

పోర్టు వాణిజ్య కార్యకలాపాలను డిసెంబర్ నాటికి ప్రారంభించడమే లక్ష్యంగా మొదటి దశలో బల్క్ బెర్త్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ బెర్తు నుంచి మొదటగా చీమకుర్తి గ్రానైట్‌ను ఎగుమతి చేయాలని ప్రణాళికను రూపొందిస్తున్నారు. బల్క్ బెర్తు నుంచి బొగ్గు, ఇనుము దిగుమతులూ జరగనున్నాయి. దీని కోసం సముద్రంలో 20 మీటర్ల లోతున పిల్లర్లు వేసి భారీ గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి దశలో చేపట్టిన నాలుగింటిలో ఒకటి బల్క్ బెర్తు కాగా.. మిగిలిన మూడు మల్టీ పర్పస్ బెర్తులు. అన్ని రకాల కార్గోను ఇక్కడి నుంచి ఎగుమతి చేయొచ్చు.

రికార్డు సృష్టించారు

ఫీడర్ల నిర్మాణ పనుల్లో ఒక్క రోజులో 38 మెట్రిక్ టన్నుల రాయిని సముద్రంలో వేసి రికార్డు సృష్టించారు. పనులు ఇంతటితో పూర్తి కాలేదని, ఫీడర్లను 8 మీటర్ల ఎత్తు వరకు నిర్మించాల్సి ఉంటుందని పోర్టు అధికారులు తెలిపారు. వచ్చే 100 నుంచి 150 ఏళ్లలో సంభవించే తుపాన్లు, సునామీలను దృష్టిలో ఉంచుకొని వీటిని నిర్మిస్తున్నారు. నెదర్లాండ్స్‌కు చెందిన డెల్టా మెరైన్ కన్సల్టేషన్ కంపెనీ తయారు చేసిన ఎక్స్ బ్లాక్, ఎక్స్ బ్లాక్ ప్లస్ రాక్‌లను బ్రేక్ వాటర్ ఫీడర్లకు అమర్చనున్నారు. ఆసియాలోనే ఈ సాంకేతికతను ఉపయోగిస్తున్న మొదటి నౌకాశ్రయం రామాయపట్నం పోర్టు కావడం విశేషం.

50 శాతం డ్రెడ్జింగ్ పూర్తి

భారీ నౌకలొచ్చి ఆగేందుకు సముద్ర లోతు కీలకం. సహజంగా ఉన్న లోతు కాకుండా సముద్ర లోతును పెంచుతున్నారు. ఇప్పటి వరకు 16 మీటర్ల లోతు వరకు డ్రెడ్జింగ్ చేశారు. 14 కిలోమీటర్ల పొడవున 200 మీటర్ల వెడల్పుతో అప్రోచ్ చానల్ (నౌకలొచ్చి.. వెళ్లే మార్గం) డ్రెడ్జింగ్‌ను 5.7 కిలోమీటర్ల మేర పూర్తి చేశారు. రెండు ఫీడర్ల మధ్య ఉండే పోర్టు ప్రాంతంలో ఈ ప్రక్రియ దాదాపు పూర్తి కావడంతో షిప్‌లను నిలిపేందుకు మార్గం సుగమమైంది. ప్రస్తుత లోతు ప్రకారం లక్ష టన్నుల సామర్థ్యం గల నౌకను ఇక్కడ నిలపొచ్చు. దీనికి అనుగుణంగా మొదటి బెర్త్‌ను నిర్మిస్తున్నారు.

2025 నాటికి పూర్తిగా అందుబాటులో

2025 ఏప్రిల్ నాటికి మొదటి దశ పనులు పూర్తయి పోర్టు పూర్తిగా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం 11 బెర్తుల నిర్మాణానికి అవకాశం ఉందని, విస్తరణలో మరో తొమ్మిది బెర్తుల నిర్మాణం ఉంటుందని పోర్టు అధికారులు చెప్తున్నారు. రెండో దశలో సముద్ర లోతును 19 మీటర్లకు పెంచడం ద్వారా రెండు నుంచి మూడు లక్షల టన్నుల సామర్థ్యం గల నౌకలొచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఒకేసారి 19 షిప్‌లు నిలిచే ప్రణాళికతో పోర్టును భవిష్యత్తులో విస్తరించనున్నారని తెలిపారు.

అనుసంధానంగా రోడ్డు.. రైల్వే మార్గాలు



పోర్టును జాతీయ రహదారితో అనుసంధానిస్తూ నిర్మాణంలో రహదారి

పోర్టును అనుసంధానిస్తూ రోడ్డు, రైల్వే మార్గాలను నిర్మించనున్నారు. చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారికి అనుసంధానంగా చేవూరు నుంచి పోర్టు వరకు ఆరు కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి పనులు వేగంగా జరుగుతున్నాయి. తెట్టు రైల్వేస్టేషన్ నుంచి పోర్టుకు లైన్ వేసే విషయమై అటవీ భూముల క్లియరెన్స్ కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఇవి వచ్చిన వెంటనే పనులను ప్రారంభించనున్నారు. ఇక పోర్టు ఏరియాలో భవనాలు, ప్రహరీ, తాగునీటి సౌకర్యం వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

విద్యా వ్యవస్థకే 15 శాతం బడ్జెట్



వాలీబాల్ ఆడుతూ..



బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, చిత్రంలో ఎమ్మెల్యే అనిల్

• మంత్రి ఆదిమూలపు సురేష్

నెల్లూరు(బారకాసు): విద్యా వ్యవస్థకు 15 శాతం బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. నగరంలోని బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.2.09 కోట్లతో నిర్మించిన షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, బాస్కెట్‌బాల్ కోర్టు ప్రారంభంతో పాటు రూ.6.27 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనను గురువారం చేపట్టారు. కార్యక్రమానికి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. పట్టణీకరణ రోజురోజుకూ పెరుగుతోందని.. పట్టణాల్లో నివసించే ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, తదితరాలను కల్పించేలా ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. నెల్లూరు నగరాభివృద్ధికి ఎమ్మెల్యే అనిల్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు.

మారిన బీవీఎస్ పాఠశాల రూపురేఖలు

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బీవీఎస్ పాఠశాలలో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, బాస్కెట్‌ బాల్ కోర్టును రూ.2.09 కోట్లతో ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. ఆరెస్సార్ హైస్కూల్లో ఫుట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గతంలో నగరంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2.5 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టారని, అయితే తమ ప్రభుత్వ హయాంలో బీవీఎస్ పాఠశాలలోనే రూ.ఐదు కోట్లతో పనులను చేపట్టామని వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలలో చదవడం అదృష్టం

ప్రభుత్వ పాఠశాలలో చదవడాన్ని విద్యార్థులు అదృష్టంగా భావించాలని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తొలుత మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వాలీబాల్, షటిల్, టేబుల్ టెన్నిస్‌ను క్రీడాకారులతో కలిసి మంత్రి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆడారు. కమిషనర్ వికాస్ మర్మత్, ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, డీఈఓ గంగాభవానీ, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

మార్గదర్శి కార్యాలయాల్లో అధికారుల సోదాలు



నర్తకి సెంటర్‌లోని కార్యాలయంలో సోదాలు చేస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైమ్): మార్గదర్శి చందాదారుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఆ సంస్థ లావాదేవీలపై సీఐడీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల ప్రత్యేక బృందాలు నగరంలోని ఆ సంస్థ కార్యాలయాల్లో సోదాలు చేపట్టారు. నగరంలోని నర్తకి సెంటర్, కరెంటాఫీస్ సెంటర్ సమీపంలోని మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం సోదాలు నిర్వహిస్తున్నాయి. ఎన్ని చిట్లు వేశారు.. చందాదారులెంతమంది.. ఎంత నగదు వసూలు చేశారు.. చెల్లింపులెంత.. పన్నుల చెల్లింపులు.. డిఫాల్టర్లకు చిట్స్ పాడుకునే అవకాశాన్ని ఏమైనా కల్పించారా.. తదితర అంశాలపై బ్రాంచ్ మేనేజర్లు, ఉద్యోగులను విచారించడంతో పాటు వాటికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గురువారం ఉదయం ప్రారంభమైన సోదాలు రాత్రి వరకు కొనసాగాయి. శుక్రవారమూ సోదాలు నిర్వహించనున్నారని సమాచారం. సీఐడీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, కిశోర్‌బాబు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్లు పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్లు మిల్క్ రోషన్, సుజన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో వివిధ శాఖల అధికారుల తనిఖీలు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్, అగ్నిమాపకశాఖ, జీఎస్టీ, తదితర శాఖల ప్రత్యేక బృందాలు నగరంలోని వాణిజ్య సముదాయాలకు సంబంధించిన భవనాలకు టౌన్‌ప్లానింగ్, అగ్నిమాపక శాఖ అనుమతులున్నాయా.. నిబంధనల మేరకే భవన నిర్మాణాలు జరిగాయా.. జీఎస్టీ చెల్లింపులు.. తదితరాలపై తనిఖీలు నిర్వహించారు. పలు విద్యాసంస్థలు, షాపింగ్ మాళ్లను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచ్‌లు ఉన్న భవనాల అనుమతుల వివరాలను సైతం సేకరించారు.

ఏళ్ల కల సాకారం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నెల్లూరు(సెంట్రల్): కాంట్రాక్ట్ ఉద్యోగుల ఏళ్ల కల నేడు సాకారమైందని ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో జిల్లాలో 11 వేల మందికిపైగా కాంట్రాక్ట్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించారని చెప్పారు. సీఎంకు కాంట్రాక్ట్ ఉద్యోగులు రుణపడి ఉంటారని తెలిపారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పలువురు కాంట్రాక్ట్ ఉద్యోగులు పూలమాల వేసి.. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు.

ఓం నారాయణ.. ఆదినారాయణ

• నేటి నుంచి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



వెంకయ్యస్వామి ఆశ్రమం

వెంకటాచలం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గొలగమూడిలోని వెంకయ్యస్వామి 41వ ఆరాధనోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వెంకయ్యస్వామి ఆశ్రమంతో పాటు గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. నిత్యం విశేష పూజలు, వేదపారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం, గణపతి పూజను నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు.. పలు చోట్ల తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. 24వ తేదీన ఆరాధన మహోత్సవాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. స్వామివారికి పట్టు వస్త్రాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు ఉదయం తొమ్మిది గంటలకు సమర్పించనున్నారు. పది గంటలకు రథోత్సవం, రాత్రి ఎనిమిది గంటలకు నిర్వహించనున్న తెపోత్సవంతో ఆరాధన మహోత్సవాలు ముగియనున్నాయి.

విశేష పూజా కార్యక్రమాలు

- శుక్రవారం: ఉదయం సర్వభూపాల వాహనసేవ, రాత్రి కల్పవృక్ష వాహనసేవ
- 19వ తేదీ: ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రి చంద్రప్రభ వాహనసేవ
- 20వ తేదీ: ఉదయం హనుమంత వాహనసేవ, రాత్రి హంస వాహనసేవ
- 21వ తేదీ: ఉదయం చినశేష వాహనసేవ, రాత్రి గజ వాహనసేవ
- 22వ తేదీ: ఉదయం అశ్వ వాహనసేవ, రాత్రి పెదశేష వాహనసేవ
- 23వ తేదీ: ఉదయం సింహ వాహనసేవ, రాత్రి గరుడ వాహనసేవ

అన్ని ఏర్పాట్లు పూర్తి



వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాం.
– బాలసుబ్రహ్మణ్యం, ఆశ్రమ ఈఓ

వేదపారాయణ సప్తాహం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పొగతోటలో గల చక్రాలవారి ట్రస్ట్ ఆదిశంకర ధ్యాన మందిరంలో శుక్రవారం నుంచి అఖండ వేదపారాయణ సప్తాహాన్ని నిర్వహించనున్నామని మేనేజింగ్ ట్రస్టీ ఆనందకుమార్, అధ్యక్షుడు వెంకటశ్రీధరశర్మ తెలిపారు. భక్తులు విశేషంగా హాజరు కావాలని కోరారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర ప్రజలు



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్రంలోని ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ పేదల సంక్షేమమే ధ్యేయంగా నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని చెప్పారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చారని వివరించారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్‌క్లినిక్‌ల ఏర్పాటుతో గ్రామాల అభివృద్ధికి బాటలు వేశారని తెలిపారు. విద్యకు పెద్దపీట వేస్తూ నాడు–నేడు కార్యక్రమంలో ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చారని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర చరిత్రలో వందేళ్లుగా సాధ్యం కాని భూముల రీ సర్వే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. దేశంలోనే అగ్రగామిగా నిలబడేలా రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారితకు శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ పథకాలతో పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా నిలిపారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా జగన్‌మోహన్‌రెడ్డిపై విజయం సాధించాలని టీడీపీ, జనసేన చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. డీసీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, స్థానిక నాయకులు అనూప్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, చిరంజీవి, శ్రీధర్, సంపత్, రవికుమార్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న జర్నలిస్టును అభినందిస్తున్న మంత్రి కాకాణి

పాత్రికేయులకు నివేశన స్థలాల మంజూరుకు కృషి

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు జర్నలిస్టులకు నివేశ స్థలాల మంజూరుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని మంత్రి కాకాణి ప్రారంభించారు. అనంతరం స్పాస్టిక్ సెంటర్‌లోని మానసిక, దివ్యాంగ పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత మంత్రి కాకాణికి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే, జర్నలిస్టులతో తనకున్న అనుబంధం రాజకీయాలకు అతీతమని స్పష్టం చేశారు. పాత్రికేయ మిత్రులకు ఏమైనా ఇబ్బందులు వచ్చినా, ఎవరైనా కష్టనష్టాల్లో ఉన్నా వారికి తనవంతు సాయం చేస్తానన్నారు. ప్రధానంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న నివేశన స్థలాల సమస్యపై కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో ఎక్కడా ఖాళీ స్థలాలు లేవని కలెక్టర్ చెప్పడంతో నెల్లూరు సమీపంలోని సర్వేపల్లి నియోజకవర్గంలోని చెముడుగుంట, నరుకూరు ప్రాంతాల్లో చూడమని సూచించామని చెప్పారు. జర్నలిస్టులందరూ ఐకమత్యంతో ఒకే తాటిపైకి వస్తే అక్రెడిటేషన్ కలిగిన వారందరికీ నివేశన స్థలాలు ఇచ్చేందుకు జాబితా తయారు చేయాలని ఇప్పటికే డీడీని ఆదేశించామని చెప్పారు. జనవరి తరువాత ఎన్నికల హడావిడి ఉంటుందని, అప్పటి లోగానే ఇళ్ల స్థలాల మంజూరు ప్రక్రియను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ తరహాలో హెల్త్ కార్డులు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. రెడ్‌క్రాస్ సేవలను మంత్రి కొనియాడారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న నివేశన స్థలాలు, ఇతర సమస్యలను తీసుకెళుతామని తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, ఉపాధ్యక్షుడు దయాశంకర్, నగరాజు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు రమేష్, గడ్డం హనుక్, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు సుధీర్‌నాయుడు, సభ్యులు మలిరెడ్డి కోటారెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సురేష్‌జైన్, ఐఅండ్‌పీఆర్ డీడీ సదారావు, విజయ్‌కుమార్‌రెడ్డి, జనార్దన్‌రాజు, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలకు కాలం చెల్లింది



అనారోగ్యంతో ఉన్న నిరుపేదను పరామర్శించి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : నిత్యం అబద్ధాలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబునాయుడు మాయమాటలకు కాలం చెల్లిందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పట్టణంలోని 18వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఇప్పుడు వచ్చి నీటిపారుదల, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేస్తానని మాయమాటలు చెబుతున్నారన్నారు. 14 ఏళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు చేయని అభివృద్ధిని ఇప్పుడు వచ్చి చేస్తానంటే ప్రజలు నమ్మరనే విచక్షణను కోల్పోయిన బాబు గంటల తరబడి సోది ప్రసంగాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వ్యవసాయం దండగ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అవసరం లేదని బాబు చేసిన ప్రచారాలను రైతులు మరిచిపోరన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపైన ఆయన చేస్తున్న విమర్శలను గమనించి ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. చంద్రబాబునాయుడు విజన్–2047 కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమేనన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలను మోసం చేయడానికి కేంద్ర ప్రభుత్వ నివేదికలను కాపీకొట్టి రూపొందించిన పత్రాన్ని జనంలోకి వదిలారని విమర్శించారు. గతంలో చంద్రబాబు విజన్–2020ను ప్రకటించి ఒక్క హామీని నెరవేర్చలేదని గుర్తుచేశారు. కరోనా సమయంలో ప్రజల వైపు కన్నెత్తి చూడని బాబు ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో తన కుటిల రాజకీయాలను అమలు చేయడం ప్రారంభించారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసు కేసుల్లో ఇరికించి, వాటి నుంచి కాపాడాలంటే అందరూ తన పార్టీలోనే ఉండాలనే దుర్మార్గమైన రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించి ప్రజలను అభద్రతాభావంలో పెట్టి పబ్బం గడుపుకోవాలనుకునే చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు వారు సిద్ధంగా ఉన్నారన్నారు.

క్లుప్తంగా

నవోదయ ప్రవేశ గడువు పొడిగింపు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

11వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో ప్రవేశానికి లేటరల్ ఎంట్రీ ద్వారా నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. కట్టా జాన్ కెవిన్ (103265), ఎన్ రేణాసృజన్ (103416), ఒద్దిపోగు సూర్య (101846), మాదగళం వైష్ణవి (101871), మద్దిరెడ్డి లక్ష్మీప్రసన్న (103344), చేవూరు నవదీప్‌కృష్ణ (103538), గొడిపేరు అభినవ్ (103590), గొలగమూడి అక్షయ సృతిక (103533) ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు 11వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన వివరాలను తల్లిదండ్రులకు పంపుతామని చెప్పారు. ఇతర వివరాలకు హెల్ప్‌డెస్క్‌ను 89850 07588, 94935 14644 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నిమ్మ ధరలు



పెద్దవి	రూ.42
సన్నవి	రూ.20
పండ్లు	రూ. 7

గడప గడపకు సంక్షేమ ఫలాలు

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఏటూరు సచివాలయం పరిధిలోని గాలిపాళెం, నూతక్కివారికండ్రిక, పడమటికండ్రికలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నూతక్కివారికండ్రికలో జగనన్న కాలనీని పరిశీలించి త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు గృహాలను మంజూరు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో ప్రతిఒక్కరూ ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలని కోరారు. సంక్షేమ పథకాల అమలుతో రాష్ట్రంలోని పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో గ్రామీణ ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలు విన్నవిస్తున్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు 99 శాతం మంది ప్రజలకు చేరువయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, జేసీఎస్ కోఆర్డినేటర్ పీ బాలగంగాధర్‌రెడ్డి, సర్పంచ్ తేళ్ల వజ్రమ్మ, ఎంపీటీసీ చెంచులక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు తేళ్ల శేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జీ మస్తాన్‌రెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ వైస్‌ప్రెసిడెంట్ గోతం వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

గంగానదిలో కొడవలూరు ఈఓపీఆర్డీ గల్లంతు

• కాశీలో ఘాట్లను వీక్షిస్తూ జారిపడిన నాగరాజు
• 24 గంటలు గడిచినా లభించని ఆచూకీ
• శోకసంద్రంలో కుటుంబసభ్యులు, అధికారులు

కొడవలూరు: మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న విశ్వాసం నాగరాజు(61) బుధవారం సాయంత్రం కాశీ క్షేత్ర సందర్శనకు వెళ్లి గంగా నదిలో గల్లంతయ్యారు. ఆయన ఆచూకీ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు విస్తృతంగా గాలిస్తున్నప్పటికీ గురువారం సాయంత్రం వరకు ఆచూకీ లభ్యం కాలేదు. నెల్లూరులో నివాసం ఉంటున్న నాగరాజుకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడికి ప్రయగ్‌రాజ్‌లోని ఐఐటీలో సీటు రావడంతో చేర్పించేందుకు భార్య మోహినీతో కలిసి కుమారుడ్ని వెంటబెట్టుకుని అక్కడికి వెళ్లారు. బుధవారం ఉదయం ఐఐటీ కళాశాలలో కుమారుడ్ని చేర్పించారు. మధ్యాహ్నం భార్య, కుమారుడితో కలిసి సమీపంలోని కాశీకి వెళ్లారు. అక్కడ గంగా నదిలోని ఘాట్లను వీక్షించేందుకు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పడవలో భార్య, కుమారుడితో కలిసి బయల్దేరారు. కొద్దిసేపటికే ప్రమాదవశాత్తు కాలుజారి నాగరాజు గంగానదిలో పడిపోయారు. పడిపోయిన వెంటనే కుటుంబ సభ్యులతో పాటు పడవలోని వారంతా కాపాడేందుకు యత్నించినా గంగా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వీలు కాలేదు. వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించగా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి వెతకడం ఆరంభించాయి. గురువారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు. 24 గంటలు గడిస్తే ఆచూకీ లభ్యమయ్యే అవకాశం ఉన్నందున సాయంత్రం నుంచి మళ్లీ వెతకడం ఆరంభిస్తామని ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు తెలిపారు.



ఈఓపీఆర్డీ నాగరాజు

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

కాశీలోని గంగా నదిలో గల్లంతైన ఈఓపీఆర్డీ నాగరాజు ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. 15 ఏళ్లుగా నాగరాజు కొడవలూరు, విడవలూరు మండలాల్లోనే ఈఓపీఆర్డీగా పనిచేస్తున్నారు. నిజాయతీ గల అధికారిగా, అందరితో ఎంతో సౌమ్యంగా వ్యవహరించే వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. కాశీలోని గంగా నదిలో నాగరాజు గల్లంతయ్యారని తెలుసుకున్న రెండు మండలాల అధికారులు విషాదంలో మునిగిపోయారు. నాగరాజు ఆచూకీ త్వరగా లభ్యం కావాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నట్లు కొడవలూరు ఎంపీడీఓ పీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జీ వసంతకుమారి, ఏఓ లక్ష్మి, ఏపీఎం రుక్మిణి, పంచాయతీ కార్యదర్శులు షబ్బీర్, మధు తెలిపారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి



సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిరుమలాపురం సచివాలయం పరిధిలోని తిరుమలాపురం, సున్నంవారిచింతలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలనతో పేదల మనసుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. గత టీడీపీ పాలనను, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనను పరిశీలించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేశారన్నారు. గ్రామ సచివాలయ, వలంటరీ వ్యవస్థల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే కాకుండా గడప గడపకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా రీ సర్వే చేపట్టి భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. చుక్కల, అసైన్‌మెంట్ భూముల రైతులకు హక్కులు కల్పిస్తున్నారని తెలిపారు. తండ్రి వైఎస్సార్‌కు మించిన తనయుడిగా పేరు తెచ్చుకున్న సీఎం వైఎస్ జగన్‌ను ప్రజలు మంచి మనసుతో ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అక్కి భాస్కర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, సర్పంచ్‌లు కే కృష్ణ, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, తిరుపతి, సుభాని, సొసైటీ అధ్యక్షుడు కే రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ మూలె సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ :	రూ.138
లేయర్ :	రూ.105
బ్రాయిలర్ చికెన్ :	రూ.238
స్కిన్‌లెస్ చికెన్ :	రూ.264
లేయర్ చికెన్ :	రూ.178

అర్హులకు ప్రభుత్వ పథకాలు

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
• ముగిసిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదేశించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాల్లో ఆమె మాట్లాడారు. చిన్న విషయాలు చెప్పినా పట్టించుకునే స్థితిలో అధికారులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తవెల్లంటిలో వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని నాలుగు నెలలుగా కోరుతున్నా, ఇంత వరకు పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. పనులు మంజూరు చేయించుకున్నా, కాంట్రాక్టర్లు చేయడంలేదన్నారు. బిల్లులు, ఎంబుక్‌ల విషయంలో వాస్తవాలను చూపాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మంజూరైన నిధులతో చేపట్టిన పనులకు బిల్లులను సకాలంలో చెల్లిస్తామని పేర్కొన్నారు. పశువులకు కొత్త వ్యాధులొస్తున్నాయని, ఈ విషయమై రైతులకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వాడీవేడిగా ఆర్థిక, ప్రణాళిక సంఘాల సమావేశం

ఆర్థిక, ప్రణాళిక సంఘాల సమావేశం వాడీవేడిగా జరిగింది. బిల్లుల చెల్లింపులు, పనులు చేపట్టడం, తదితర అంశాలపై అధికారులను సభ్యులు నిలదీశారు. కలువాయిలో ఇనుప విద్యుత్ స్తంభాలున్నాయని, దీని కారణంగా వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలువాయి జెడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. అదే విధంగా వివిధ సమస్యలను పలువురు సభ్యులు లేవనెత్తారు. సభ్యులు తెలిపిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆదేశించారు. జెడ్పీటీసీలు, అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు (క్రైమ్): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు..వేదాయపాళెం–వెంకటాచలం మధ్యన రైలు ఢీకొనడంతో సుమారు 35 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు పసుపు రంగు హాఫ్ హ్యాండ్స్ టీషర్ట్, స్కై బ్లూ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. రైల్వేపోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.